క్లుప్తంగా

గిరిజన పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

పెద్దదోర్నాల: మండల పరిధిలోని ఐనముక్కల వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 3వ తరగతి నుంచి 6వ తరగతి వరకు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పెంటయ్య తెలిపారు. ఆసక్తి ఉన్న బాలికలు ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 84669 36638, 93475 84306 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

తిరుమలనాథస్వామికి పూజలు



తిరుమలనాథ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత గొంద్రాలికొండ తిరుమలనాథస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కిశోర వికాసంపై అవగాహన



కిశోర వికాసంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

త్రిపురాంతకం: స్థానిక గ్రామ సచివాలయంలో కౌమార బాలికల ఆరోగ్య సంరక్షణ, ఆత్మ సంరక్షణ కోసం కిశోర వికాసంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హైమావతి, కుమారి అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో భాగంగా పోషకాహారం ప్రాముఖ్యత, కౌమార బాలికల్లో వచ్చే ఆరోగ్య సమస్యలు, బాలికల అక్రమ రవాణా తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశానికి అర్హత



మండల టాపర్‌గా నిలిచిన కౌశిక్

ముండ్లమూరు (కురిచేడు): మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలో స్థానిక ఎంపీపీ పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. అదే పాఠశాల విద్యార్థి కౌశిక్ మండల టాపర్‌గా నిలిచాడు. అదే పాఠశాలలో చదివే విరాట్ శేఖర్ 4వ ర్యాంకు, దీక్షిత 8వ ర్యాంకు సాంధించారు. ఒకే పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడంపై మండల విద్యాశాఖాధికారులు సుబ్బారావు, వెంకటేశ్వర్లు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సోపారావులు ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, విద్యార్థులు, ఉపాధ్యాయుడు రాఘవను అభినందించారు.

ప్రమాదకర ప్రయాణాలు వద్దు

మార్కాపురం: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణాలు చేస్తే ప్రమాదాలు సంభవిస్తాయని స్థానిక టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్ హెచ్చరించారు. శనివారం పట్టణ శివారులో ట్రాక్టర్లు, ఆటోలు, వివిధ వాహనాల్లో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వారిని ఆపి డ్రైవర్లు, ప్రయాణికులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణించకూడదని, అలా చేస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తానని హెచ్చరించారు. ఓవర్ లోడ్‌తో వాహనాల్లో ప్రయాణిస్తే ప్రమాదవశాత్తూ ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ ప్రాణనష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి భక్తాంజనేయ స్వామి వార్షికోత్సవం

మార్కాపురం టౌన్: మండలంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో వెలసిన భక్తాంజనేయస్వామి 36వ వార్షికోత్సవాన్ని ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.రామకృష్ణారెడ్డి, వాగిచర్ల సుబ్బారావు శనివారం తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అఖండ జ్యోతి ప్రజ్వలన, స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్న సంతర్పణ, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వార్షికోత్సవాల్లో ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, పాటకచేరీ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

పాములున్నాయి..జాగ్రత్త!

- ఎండకు కలుగుల్లో నుంచి బయటకు వచ్చే అవకాశం
- నాలుగు నెలల్లో 23 పాముకాటు కేసులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యాధికారులు



ఈ ఏడాది నాలుగు నెలల్లో నమోదైన కేసులు

నెల	నమోదైన కేసులు
జనవరి	2
ఫిబ్రవరి	11
మార్చి	4
ఏప్రిల్	6

పెద్దదోర్నాల: వేసవిలో పాముకాటు ప్రమాదాలు అధికంగా ఉంటాయి. వేడి, ఉక్క పోతలకు సర్పాలు కలుగుల్లో నుంచి బయటకు వచ్చి ఆహారం, నీరు, చల్లటి ప్రదేశాల కోసం అన్వేషిస్తుంటాయి. ఈ నేపథ్యంలో పొదలు, మురుగు ప్రాంతాలు చూసుకోకుండా వాటిపై కాలు వేస్తే అవి కాటేసే ప్రమాదం ఉంది. రైతులు, ఉపాధి కూలీలు, శివారు ప్రాంతాల్లో జీవించే వారు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మండల పరిధిలోని నల్లమల అభయారణ్య పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న కొర్రప్రోలు, మంతనాల, నల్లగుంట్ల, ఎగువ చర్లోపల్లి, చింతల, తుమ్మలబైలు లాంటి ప్రాంతాల్లో పాముల బెడద అధికంగా ఉంటుందని, గడిచిన నాలుగు నెలల్లో ఆయా ప్రాంతాల్లో 23 పాము కాటు కేసులు నమోదైనట్లు పెద్దదోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ వైద్య సంజీవ్ పేర్కొంటున్నారు.

వేసవిలో పాముల బెడద ఎక్కువ

నేల వేడెక్కటంతో చల్లని ప్రదేశాల కోసం పాములు అన్వేషిస్తుంటాయని అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇంటి పరిసరాల్లోని మురుగు ప్రాంతాల నుంచి అవి నీటి కోసం ఇళ్లలోకి వస్తుంటాయని, ఎలుకలు, చిన్న చిన్న కీటకాలను తినేందుకు అవి ఎక్కువగా సంచరిస్తుంటాయిని వారు పేర్కొంటున్నారు. కొన్ని సర్పాలు వేగంగా దాడి చేసే లక్షణాలు కలిగి ఉంటాయని, అవి రాత్రి పూట చురుగ్గా కదులుతుంటాయన్నారు. వీటిలో రక్త పింజర, కట్ల పాము, నాగుపాములు అత్యంత విషపూరితమైనవి కాగా, పసరిక, జెర్రిగొడ్డు, నీరు గట్టె, రెండు తలల పాములు ఇలా ఎన్నో పాములు విష రహితమైనవిగా పేర్కొంటున్నారు.

పాము కాటు వేసినప్పుడు జాగ్రత్తలు పాటించాలి: వైద్య సంజీవ్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పెద్దదోర్నాల

పాము కాటు వేసినప్పుడు బాధితులు ఎక్కువగా కదలకుండా ఆందోళన చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పాము కాటేసినప్పుడు సాధ్యమైనంత వేగంగా వైద్యశాలకు తీసుకెళ్లాలి. కాటు వేసిన ప్రాంతాన్ని కోయటం, నోటితో పీల్చటం వంటి పనులు చేయవద్దు. ముఖ్యంగా కరిసిన పాము ఏ రకానికి చెందిందో తెలుసుకుంటే చికిత్సకు మరింత సులభంగా ఉంటుంది. ఎక్కువ భయపడితే మరణాలు సంభవించే ప్రమాదం ఉంది. కరిసిన పాములు విషపూరితమైనవైతే గాయమైన చోట వాపు, రక్తం గడ్డ కడతాయి. ఇంటి పరిసరాల్లో చెత్త చెదారం నిల్వుంచుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రిళ్లు బయట తిరిగే వారు టార్చి లైటు వెంట ఉంచుకోవాలి.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తాటిపర్తి

గ్రామీణ సమస్యలపై స్పందించండి

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయా ప్రాంతాల నాయకులు స్పందించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. మే నెలలో ఎండలు ఉధృతమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ కారణంతో భూగర్భ జలాలు అడుగంటి గ్రామాల్లో నీటి సమస్య అధికమవుతుందని పేర్కొన్నారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాలను ముందుగా గుర్తించి తన దృష్టికి తీసుకు రావాలని, ఈ సమస్యను ఉన్నతాధికారుల వద్ద ఉంచి పరిష్కరించుకుందామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలు విస్మరించి తమ నాయకులు దోచుకునే అవకాశాన్ని కల్పిస్తోందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేశారని, ఆయన ప్రవేశపెట్టి అమలు పరిచిన సంక్షేమ పథకాల గురించి, కూటమి నాయకులు చేసిన వాగ్దానం సూపర్ సిక్స్ అమలు కాని పరిస్థితులపై ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలతో ఎన్నికైన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లను పక్కన పెట్టి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో అధికారులు గ్రామ సభలు నిర్వహించుకుంటున్న తీరుపై ఎండగట్టాలని ఆయన సూచించారు. నిత్యం ప్రజలతో మమేకమైనవారే మంచి నాయకుడిగా ఎదగగలుగుతారని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి వారి సమస్యలపై నిరంతరం పోరాడాలని ఎమ్మెల్యే తాటిపర్తి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి కె.ఓబులరెడ్డి, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, టి.సత్యనారాయణరెడ్డి, ఎ.కోటివీరారెడ్డి, పల్లె ఫిలిప్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సయ్యద్ జబీవుల్లా, ఒంగోలు సుబ్బారెడ్డి, పి.రాములు నాయక్, రోశిరెడ్డి, కె.సత్యనారాయణరెడ్డి, సి.నాగయ్య, షేక్.వలి, కందుల నాగార్జునరెడ్డి, హరినాయక్ పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు



ఏఐవైఎఫ్ పతకావిష్కరణ చేస్తున్న కరుణానిధి

దర్శి (కురిచేడు): నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయం గుజ్జుల సరళాదేవి భవన్లో అఖిల భారత యువజన సమాఖ్య 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం దాదాపు 12 సంవత్సరాలుపైబడి అధికారంలో ఉన్నా ఇంతవరకు యువతకు ఉద్యోగాలు కల్పించలేదన్నారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తామని యువతకు ఇచ్చిన మాట గాలికి వదిలేశారని మండిపడ్డారు. తన మిత్రులైన అంబానీ, అదానీలకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్పొరేట్ ఆస్తులన్నీ కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. దొనకొండలో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే మరిచారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు అనేక హామీలు ఇచ్చి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల 38 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మాట ఇచ్చి ఏడాది గడుస్తున్నా దాని ఊసే ఎత్తడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రతి నిరుద్యోగికి నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ ఎండమావిగా మారిందన్నారు. యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాటాలకు యువత సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ ఆయన పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజి యాదవ్, నాయకులు జి.శేఖర్, యశ్వంత్, ప్రభుదేవా, రాజేష్, అజయ్ పాల్గొన్నారు.

స్పెషల్ ఆధార్ క్యాంపులు వినియోగించుకోవాలి

పుల్లలచెరువు: కలెక్టర్ ఆదేశాలపై ఈ నెల 5వ తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. ప్రజలు, చిన్నారులు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 5,6వ తేదీల్లో చాపలమడుగు, కొమరోలు, పుల్లలచెరువులో, 7,8 తేదీల్లో పీవీపల్లి, మల్లాపాలెం, పుల్లలచెరువులో, 12,13 తేదీల్లో గంగవరం, పీఆర్‌సీ తండా, పుల్లలచెరువులో, 14,16వ తేదీల్లో మానేపల్లి, యండ్రపల్లి, పుల్లలచెరువులో స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చెంచు గూడెల్లో కూడా క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5న గండిబావిగూడెం, అక్కపాలెం, 6న ఐటీవరం, శతకోడు, 7న రెంటపల్లి, శతకోడు, 8న చౌటపాచర్ల, తెల్లగట్ల, 12న సిద్ధనపాలెం, సింగుపల్లి, 13,14న ఐటీవరం, ముటుకుల, 16న మానేపల్లి, ముటుకుల, 17, 18న మర్రివేముల, నరజాముల తండాల్లో క్యాంపులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకాళపరమేశ్వరి దేవి తిరునాళ్ల



అమ్మవారి మూలవిరాట్



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కురిచేడు: మండలంలోని ఎస్ఎస్‌పీ అగ్రహారం అంకాళ పరమేశ్వరి దేవి తిరునాళ్ల శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు, భక్తులు ఉదయం నుంచి అమ్మవారికి పొంగళ్ల తయారు చేసి నివేదించి తమ మొక్కులు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి



గాయపడిన మాలిక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త, మాజీ డీలర్ షేక్ ఖాసిం పీరా కుమారుడు షేక్ మాలిక్‌ను ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం పరామర్శించారు. ఇటీవల మండలంలోని అయ్యంబొట్లపల్లికి సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మాలిక్ తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యశాలలో చికిత్స పొందిన ఆయన విశ్రాంతి తీసుకుంటున్నాడన్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వారి ఇంటి వద్దకు వెళ్లి కార్యకర్తను పరామర్శించారు.

ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, టి.సత్తిరెడ్డి, ఎ.కోటివీరారెడ్డి, ఫిలిప్, సయ్యద్ జబీవుల్లా, షేక్ కాశిం, ఒంగోలు సుబ్బారెడ్డి, హరిబాబు నాయక్, షేక్ ఫజుల్, షేక్ మహబూబ్ సుభాని ఉన్నారు.

7న వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదిన వేడుకలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 7వ తేదీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో లలితా సహస్రనామ పారాయణం, ఉత్సవమూర్తికి పంచామృత అభిషేకం, ఆర్యవైశ్య మహిళల చేత సామూహిక కుంకుమార్చన పూజ, మహా మంగళహారతి, మూలవిరాట్ మూర్తి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా కోరారు.

అదుపుతప్పి కారు బోల్తా

కొమరోలు: మండలంలోని బాలిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో ఓ కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటన శనివారం చోటు చేసుకోగా కారులో ఉన్న ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు బెలూన్లు తెరచుకోవడంతో క్షతగాత్రులకు ప్రాణాపాయం తప్పింది. కారు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయింది.

ఉత్తమ పౌరులుగా మెలగాలి

కొమరోలు: ఉత్తమ మార్కులు సాధిస్తే సరిపోదని, సమాజంలో ఉత్తమ పౌరులుగా మెలగాలని మండల విద్యాశాఖాధికారి–1 కావడి వెంకటేశ్వర్లు తెలిపారు. కొమరోలులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన 19 మంది విద్యార్థులను శనివారం సత్కరించి సర్టిఫికెట్‌లు అందించారు. 550పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపీపీ అమూల్య, ఎస్సై నాగరాజు, ఎంఈఓ వెంకటేశ్వర్లు సన్మానించారు. అనంతరం ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా చక్కగా చదివి మంచి మార్కులు సాధించాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. మంచి లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని ఆ లక్ష్యాలకు అనుగుణంగా విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ బ్రహ్మయ్య, రిటైర్డ్ డిప్యూటీ ఈఓ అమరేశ్వరరావు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలు

కొమరోలు: కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గోనపల్లె, మదవపల్లె గ్రామాల మధ్యలో శనివారం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని కారు వేగంగా ఎదురుగా ఢీకొనడంతో కోనపల్లె గ్రామానికి చెందిన చెన్నయ్య, వెంకట సుబ్బయ్యకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో గిద్దలూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు ఆగకుండా వేగంగా వెళ్లిపోయింది.

ఆనంద ఆశ్రమంలో గురుపూజ మహోత్సవం



కోలాటం ప్రదర్శన



సామూహిక హారతులిస్తున్న మహిళలు

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో శనివారం భక్తులు గురుపూజ మహోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పరి పూర్ణ సిద్ధానంద స్వామివారికి ఆశ్రమ వ్యవస్థాపకులు భైరవానంద స్వామి దంపతులు గురుపూజ మహోత్సవం నిర్వహించారు. పొదిలికి చెందిన పగడాల మల్లికార్జునరావు గురుపూజ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు నేపాల్ పంచముఖి రుద్రాక్షలు ఉచితంగా అందజేశారు. ఒంగోలు అచలానంద ఆశ్రమ కోలాట బృందం కోలాటం ప్రదర్శించింది. ఆనంద ఆశ్రమంలోని దేవతలందరికీ పూజా కార్యక్రమం నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు భైరవానంద స్వామి అన్ని వసతులు ఏర్పాటు చేశారు.

డిజైన్ స్లేట్ కార్మికుల కూలి రేట్లు పెంచాలి



ఓనర్స్ అసోసియేషన్ నాయకులకు నోటీసు ఇస్తున్న కార్మికులు

మార్కాపురం: డిజైన్ స్లేట్ అండ్ మొజాయిక్ వర్కర్ల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ కోరారు. శనివారం స్థానిక ఎస్టేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యం – కార్మికుల మధ్య జరిగిన కూలి రేట్ల అగ్రిమెంటు కాలపరిమితి ముగిసిందన్నారు. నూతన అగ్రిమెంటు చేసుకుని కూలి రేట్లు వెంటనే పెంచాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పోలిస్తే ప్రస్తుతం చెల్లిస్తున్న కూలి రేట్లు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ప్రస్తుతం చెల్లిస్తున్న 297 రూపాయల కూలిని రూ.371కు పెంచాలని, హెల్పర్‌కు 294 నుంచి 367 రూపాయలకు, స్ప్లిట్టర్‌కు 320 నుంచి 400 రూపాయలకు, క్యాలిబ్రేషన్ కార్మికులకు 150 నుంచి 187 రూపాయలకు పెంచాలని కోరారు. మొజాయిక్ కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న కూలికి అదనంగా 25 శాతం పెంచాలన్నారు. కార్మికులకు ప్రమాదాలు జరిగితే గాయాలు తగ్గేంత వరకు మెడికల్ ఖర్చు, చట్టప్రకారం కూలీలు, కార్మికులకు యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేవారు. డబుల్ డ్యూటీ చేసిన కార్మికులకు పుల్ భోజనం ధర ఇవ్వాలని యజమానులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన అగ్రిమెంటుకు సంబంధించిన కూలి రేట్లతో కూడిన నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. 14 రోజుల్లో కూలీల ధరలు పెంచితే సమ్మె చేసేందుకు వెనకాడమని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బాలశేషయ్య, టి.రాములు, వెంకటేశ్వరరెడ్డి, మాబు, యాకోబు, బాబు, స్వామి, రమేష్, లక్ష్మయ్య, మల్లమ్మ, నాగులు, అంజి, బ్రహ్మయ్య, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.